ప్రజాశక్తి
ఆదివారం 18 మే 2025 | 5 | అనంతపురం





తిరంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

సైనికులకు అండగా నిలుద్దాం

◆ మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్
◆ అనంతలో తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశ రక్షణలో సేవలు అందిస్తున్న సైనికుల శక్తి సామర్థ్యాలకు అండగా నిలవాలని రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తెలుపుతూ తిరంగా యాత్ర నిర్వహించారు. శనివారం అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గ్రౌండ్ నుంచి ప్రారంభమై టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు తిరంగా యాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, ఎమ్మెస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ నారాయన్ శర్మ, మాజీ సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేశవ్ మాట్లాడుతూ సరిహద్దుల్లో ప్రాణాలను అడ్డుసి సైనికులు దేశ రక్షణలో పాలు పంచుకుంటున్నారని చెప్పారు. పాక్ కాల్పుల్లో సత్యసాయి జిల్లాకు చెందిన సైనికుడు ఎం.మురళి నాయక్ ప్రాణాలు పోగొట్టుకోవడం విచారకరం అన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ పహల్గం ఉగ్రదాడిలో అమాయక పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మందిని పొట్టపెట్టుకున్నారన్నారు. ఈ దాడి అనంతరం భారతదేశ సైన్యం చూపి తెగవ మరువలేనిదని చెప్పారు. ఉగ్రవాదులు, ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుంటూ సైన్యం ధ్వంసం చేసిందని తెలిపారు. ప్రతి భారతీయ పౌరులను తలెత్తుకునే విధంగా మన సైన్యం చేశారన్నారు. కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన త్రివిధ దళాల సైనికులకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, డివిఈఓ వెంకటరమణా నాయక్, డీఈఓ ప్రసాద్ బాబు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వేంకటేశ్వరరావు, డిఎంహెచ్ఓ ఈబి.దేవి తదితరులు పాల్గొన్నారు.



◆ జెఎన్‌టియులో పండుగ వాతావరణం
◆ విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి
◆ ఛాన్సలర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
◆ 41 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేత
◆ డా॥సత్యనారాయణ చావాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

సంబరంగా స్నాతకోత్సవం..!



ఆరు బంగారు పతకాలు అందుకున్న విద్యార్థి పూజిత్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు) 14వ స్నాతకోత్సవం కార్యక్రమం శనివారం నాడు సంబరంగా జరిగింది. ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెఎన్‌టియుకు చేరుకున్న గవర్నర్‌కు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శనావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, యూనివర్సిటీ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో 14వ స్నాతకోత్సవం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు ప్రారంభించారు. హైదరాబాద్ లారెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా॥సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. 41 మంది విద్యార్థులకు బంగారు పథకాలను గవర్నర్ అందజేశారు. అందులో పూజిత్ కుమార్ రెడ్డి అత్యధికంగా ఆరు బంగారు పథకాలు, విద్యార్థిని సుప్రజా నాలుగు బంగారు పతకాలు అందుకున్నారు. స్నాతకోత్సవానికి ఐఐటి కాన్పూర్ సివిల్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్.మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి ఎం.జవహర్ లాల్, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టరు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఆచార్య దుర్గా ప్రసాద్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, సింధూరరెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు.. తల్లిదండ్రుల సందడి

అనంతపురం జెఎన్‌టియు స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులతో సందడి నెలకొంది. ఇంజనీరింగ్, ఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేసే కార్యక్రమం ఆద్యంతం క్రమశిక్షణతో నడిచింది. విద్యను పూర్తి చేసుకుని పట్టాను పొందే క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడికి విచ్చేసి తమ పిల్లలు ప్రయోజకులయ్యారని కళ్లారా తిలకించి ఆనందపడ్డారు. తమ సంతోష మధుర క్షణాల్లో సెల్ఫీలు తీసుకుంటూ ఆనంద పడ్డారు.

41 మందికి బంగారు పతకాలు...

40,109 మంది డిగ్రీ పట్టాలు

ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 41 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ సత్యనారాయణ చావా

40,109 మంది విద్యార్థులకు యూజి, పిజి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. పరిశోధనలకు సంబంధించి ఇంజినీరింగ్‌లో 167 మందికి, డాక్టర్ ఆఫ్ ఫార్మసిలో 361 మందికి, ఎంటెక్, ఎంఫార్మసి, ఎంఎబి పూర్తి చేసిన వారికి 9564 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. బిటెక్, బిఫార్మసి పూర్తి చేసిన విద్యార్థులు 30,017 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు.

'అనంత'జెఎన్‌టియు అగ్రగామి
గవర్నర్ అబ్దుల్ నజీర్



నూతన విద్యా విధానం అమలు చేయడంలో అనంతపురం జెఎన్‌టియు ముందు భాగంలో ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఛానల్సర్ హోదాలో స్నాతకోత్సవానికి హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జెఎన్‌టియుఎ క్వాంటమ్ ఇంజినీరింగ్‌ను మిని డిగ్రీగా అమలు చేస్తోందన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కోర్సులను తీసుకొస్తూ ముందుకెళుతోందన్నారు. విద్యను పూర్తి చేసి బయట పోటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు అందుకు అనుగుణంగా సన్నద్ధమవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మనం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉన్నామన్నారు. మిషన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని ముందుకెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవ్వాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అభివృద్ధి ఫలాలను కార్పొరేట్ గోడలను దాటించి గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. అటు భారత దేశంలోనూ, ఇటు రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధికి వివిధ రకాల చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్నాయన్నారు.

మార్పులను అందిపుచ్చుకోవాలి
ఆర్.ఎం.మాధవ్ ఐఐటి రిటైర్డు ప్రొఫెసర్



ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఆర్.ఎం.మాధవ్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు వస్తున్నాయన్నారు. తాము చదువుకుని బయటకొచ్చిన సమయంలో నిర్మాణ రంగంలో చూసినప్పుడు భవన నిర్మాణానికి 80 శాతం ఖర్చు అయితే, ఇంటీరియర్‌కు 20 శాతమే ఖర్చు అయ్యేదన్నారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా నిర్మాణం కంటే ఇంటీరియర్ ఖర్చు అధికమవుతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సులోనూ వేగంగా మార్పులొస్తున్నాయన్నారు. ఒక్కప్పుడు చాట్ జిపిటినే అనేవాళ్లు ఇప్పుడు డీప్ సీక్ అనేది వచ్చింది. ఇలా సాంకేతికంగా వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని ముందుకెళ్లాల్సిన అవసరముంటుందని చెప్పారు.

కదిరి వైసిపికి షాక్

13 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజవకర్గం వైసిపికి భారీ షాక్ తగిలింది. .వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. శనివారం నాడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టిడిపి కండువాలు కప్పుకున్నారు. మరో రెండు రోజుల్లో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ఉన్న నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరడంతో ఛైర్మన్ గిరి టిడిపి వశం కావడం లాంఛనమే అయ్యింది. కదిరి మున్సిపాల్టీలో మొత్తం 36 ఉండగా ప్రస్తుతం వైసిపిలో చేరిన వారితో కలిపి టిడిపికి 25 మంది కౌన్సిలర్లు అయ్యారు. వైసీపీకి 11 మంది కౌన్సిలర్లు మిగిలారు. సోమవారం నాడు ఛైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నోటిఫికేషన్ జారిచేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టిడిపికి ఉన్న సంఖ్యా బలంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను సులువుగా ఆ పార్టీ ఖాతాలో వేసుకోనుంది.

వైసిపిది అవినీతి పాలన : కందికుంట

గత వైసిపి పాలనలో మితిమీరిన అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. వార్డుల్లో అభివృద్ధి జరగక కౌన్సిలర్లు విసిగిపోయారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించి వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారన్నారు.



కందికుంట సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

గోవింద నామస్మరణతో మార్మోగిన పెన్నోబిలం

వైభవంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం-పట్టువస్త్రాలు సమర్పించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని పెన్నోబిలం క్షేత్రం శనివారం సాయంత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అశేష జనవాహని మధ్య బ్రహరథోత్సవం నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా తెల్లవారుజామునుంచే స్వామివారి మూల విరాట్‌కు విశేష పుష్పలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం అందంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలను ఇఒ ఆలయ కార్య నిర్వహణ అధికారి సాకే రమేష్ బాబు,అర్చకులు ద్వారాకనాథ్, బాలాజీ స్వామి, గుండురావు, ఇతర బ్రాహ్మణుల ఆధ్వర్యంలో పల్లకిలో ఉరిగింపుగా తీసుకెళ్లి రథంలో కొలువుదీర్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ఉదయం బ్రాహ్మణ సంఘం మడుగు తేరును కొంత దూరం లాగారు. సాయంత్రం ప్రత్యేక పూజల చేసి రథాన్ని లాగారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా 'శ్రీలక్ష్మీ నారసింహా స్వామి గోవిందా గోవింద' అంటూ భక్తులు స్వామి నామస్మరణ చేస్తూ పులకించిపోయారు. రథోత్సవ కార్యక్రమానికి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా వచ్చారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక బందాల ద్వారా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.



అశేష జనవాహిణి మధ్య సాగుతున్న లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి కేశవ్


పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కేశవ్

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ప్రభుత్వం తరపున మంత్రి పయ్యావుల కేశవ్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకే రమేష్‌బాబు, ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించేంత వరకూ సమ్మె

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక శ్రీరామిరెడ్డి పంప్‌హౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె 42వరోజు శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి కార్మికులకు పెండింగ్‌లో వేతనాలు చెల్లించాలని కోరుతూ ఇటు నాయకులు, అటు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. గత్యంతరం లేక సమ్మెబాట పట్టారన్నారు. కార్మికులకు వేతనాలతోపాటు పిఎఫ్ సొమ్మును కూడా చెల్లించడం లేదన్నారు. కావున ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి యూనియన్ కార్మికులు ప్రభాకర్, వన్నూరుస్వామి, నరేష్, బాషా, తదితరులు పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

సిఎం చంద్రబాబుది డైవర్షన్ పాలిటిక్స్

కక్షరాజకీయాలకు స్వస్తి చెప్పి హామీల అమలుపై దృష్టి పెట్టండి
వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు పెట్టింది పేరు అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న కక్షసాధింపు రాజకీయాలకు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ నాయకులపైనే కాకుండా ఐఎఎస్, ఐపిఎస్‌లపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. కొందరు అధికారులకు పోస్టింగ్స్ కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాల వాళ్లు కూడా విస్తుపోయే పరిస్థితి వచ్చిందన్నారు. గతంలో స్కిల్ స్కాంలో చంద్రబాబును సాక్ష్యాధారాలతో అరెస్టు చేశారని, ఈ ప్రభుత్వంలో ఏదో ఒక విధంగా జగన్‌పై తప్పుడు కేసులు పెట్టాలని చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్ కార్యదర్శిగా పని చేసిన ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి, ఒఎస్‌డిగా పని చేసిన కృష్ణమోహన్‌రెడ్డిని అరెస్ట్ చేయడం కక్షసాధింపు చర్యల్లో భాగమేనన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఆధారాలు లేకపోయినా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. హైకోర్టు జడ్జిలు అక్షింతలు వేసినా ఏమాత్రం సిగ్గు లేకుండా ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గించాలన్న లక్ష్యంతో కఠిన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రయివేట్ మాఫియాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వం ద్వారానే మద్యం అమ్మకాలు చేశామని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వంలోనే అనుమతి ఇచ్చిన దుకాణాల కంటే మూడింతలు అధికంగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నారు. అక్రమ కేసులు, అరెస్టులు చేసినా వైసిపి కార్యకర్త నుంచి నాయకుల వరకూ భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కూటమి పార్టీలకు భవిష్యత్‌లో ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలకు స్వస్తి పలికి ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

దుర్గం బీట్ ఎఫ్‌బిఒ క్వార్టర్స్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం సర్కిల్ అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారిణి ఆర్.యశోదాబాయి ఆధ్వర్యంలో అనంతపురం రేంజ్‌లో నవీకరించిన అనంతపురం రేంజ్ ఆఫీస్, దుర్గం బీట్ ఎఫ్‌బిఒ క్వార్టర్స్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతపురం గ్రీన్ ఆర్మీ అనిల్‌కుమార్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అటవీ శాఖ అధికారి విగ్నేష్ అప్పావు, సర్కిల్ ఆఫీస్, డివిజినల్ ఆఫీస్, అనంతపురం సామాజిక వన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న యశోదాబాయి

అధిక రక్తపోటును నియంత్రించుకోవాలి

డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

ప్రతి ఒక్కరూ అధిక రక్తపోటును నివారించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డిఎంహెచ్ఒ ప్రారంభించారు. డిఎంహెచ్ఒ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ తెలుగు తల్లి విగ్రహం వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా మనిషి జీవితాన్ని దెబ్బ తీస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్షలు చేయించుకుంటూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంక్రమిత వ్యాధుల నోడల్ ఆఫీసర్ జి.నారాయణస్వామి, డిఐఒ డాక్టర్ యుగంధర్, లెప్రసీ, ఎయిడ్స్ అధికారి అనుపమ జేమ్స్, మలేరియా అధికారి ఓబులు, ఎఒ గిరిజా మనోహర్, డెమో త్యాగరాజ్, ఆరోగ్య విద్యా అధికారి గంగాధర్, ఎన్‌హెచ్ ఎం కిషోర్‌కుమార్ ఫణి, డిస్టిక్ ఫ్లోరోసిస్ కాన్సల్టెంట్ ఆంజనేయులు, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బి.శ్రీరాములు, ప్రేమ్‌బాబు, కిషోర్, శశి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రసన్న వెంకటరమణస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని శనివారం వైభవంగా సాగింది. ఇందులో భాగంగా కోటలోని ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను చిన్నరథంపై ఉంచి తేరు వీధి వరకూ తీసుకొచ్చారు. అక్కడ రథంగా హోమం నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులను తేరుపై ఉంచి మధ్యాహ్నం వినాయక కూడలి వరకూ మడుగు తేరు లాగారు. సాయంత్రం వినాయక కూడలి నుంచి నేసేపేటలోని భక్త మార్కండేయ స్వామి ఆలయం వరకూ రథాన్ని లాగారు. అక్కడ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సమూహ దేవాలయాల కార్య నిర్వహణ అధికారి నరసింహారెడ్డి, పుర ప్రముఖులు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ ఇన్స్పెక్టర్ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

'రెన్యూ'పై లోకేష్ అబద్ధాలు

వైసిపి అధికార ప్రతినిధి శ్యామల

ప్రజాశక్తి-అనంతపురం

రేణు సోలార్ ప్రాజెక్ట్ జగన్ హయాంలో ఒప్పందం చేసుకుంటే దావోస్‌లో ఒప్పందం చేసుకున్నట్లు మంత్రి లోకేష్ అబద్ధాలు చెప్తారని వైసిపి అధికార ప్రతినిధి శ్యామల విమర్శించారు. శనివారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో మహిళా విభాగం నేతలతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్‌కు నిజంగా జిల్లాపై ప్రేమ ఉంటే సమస్యలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు ఇస్తారో చెప్పలేదన్నారు. ఎలుకలు కొరికిన కెఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. జిల్లా సమస్యల పై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నారా లోకేష్ వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్యామల

చినుకు పడితే

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలో కొద్దిపాటి చినుకులు పడినా కరెంటు బంద్ నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. చిన్నపాటి చినుకులు పడినా మండల కేంద్రంతోపాటు నాగిరెడ్డిపల్లి, తక్కల్లపల్లి, గూడూరు, గాండ్లపాడు, పోతిరెడ్డిపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో కరెంటు లేకపోవడంతో వృద్ధులు, చిన్న పిల్లలు అవస్థలకు గురవుతున్నారు. అసలే వేసవికాలం కావడం, ఎండలు తీవ్రత ఉండడంతో ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. కరెంటను పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపానపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి చినుకు పడితేనే కరెంటు పోకుండా మండల ప్రజలు కోరుకుంటున్నారు.

అవినీతి ఎక్సైజ్ సిఐను సస్పెండ్ చేయాలి

కళ్యాణదుర్గం : ఆఫీస్ బాయ్‌ని చెప్పుతో కొట్టిన ఎక్సైజ్ సిఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ప్రజా సంఘాల నాయకులు పట్టణంలోని కార్యాలయంలో ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో ఎక్సైజ్ సిఐ భారీ స్థాయిలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. ముఖ్యంగా కర్ణాటక మద్యం విక్రయదారుల నుండి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తోందన్నారు. ఈమె అవినీతిపై ఇప్పటికే ప్రజాసంఘాల నాయకులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అవినీతికి పాల్పడుతూ ఆఫీస్ బాయ్‌పై చెప్పుతో దాడి చేయడం బాధాకరమన్నారు. వెంటనే సిఐపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షులు చెలమప్ప, నాయకులు ధన, తిమ్మప్ప, ఎల్ఆర్ఎఫ్ తాలూకా నాయకులు దుర్గప్ప, ఎమ్మెస్ఎఫ్ నాయకులు ధను, బ్రహ్మసముద్రం మండలం జెఎసి నాయకులు ఏరిడీ కేర చంద్ర, సుగేపల్లి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెప్పుతో దాడి అమానుషం

అనంతపురం సిటీ : సమాజం సిగ్గు పడే విధంగా వ్యవహరించిన ఎక్సైజ్ సిఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాకే హరి మాట్లాడుతూ కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాబాను అవినీతి, అక్రమ వసూళ్ల కోసమే ప్రయివేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకున్నాడన్నారు. ఈనేపథ్యంలో తనను కాపాడుకోవడానికి ఆఫీస్ బాయ్‌పై చెప్పుతో దాడి చేయడం సరైంది కాదన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఎక్సైజ్ సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫైట్ ఫర్ రైట్స్ కేపీ రాజు, సమతా సైనిక్ దళ్ సుగమంచి శ్రీనివాసులు, విద్యార్థి నిరుద్యోగ ఐక్యవేదిక టిపి రామన్న, జెఎసి నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, ఎగ్గడి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

బ్రహ్మసముద్రం : చుట్టూ ఉండే పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఖాసింబీ, రామాంజనమ్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని పిల్లలపల్లి, నాగిరెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బాలింతలు, గర్భవతులు, కిషోర్ బాలికలు, తల్లులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎర్రమ్మ, వెంకటమ్మ, నాగమణి, చెన్నమ్మ, ఎఎన్ఎంలు నల్లక్క, నాగమణి, ఎంఎల్‌హెచ్‌పి సాయి, మౌనిక, అంగన్వాడీ హెల్పర్లు ధనలక్ష్మి, సువార్త, శివలింగమ్మ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

నార్పల : మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట కాలనీకి చెందిన పుల్లయ్య, నడిమిదొడ్డి ఓబులేసు కుటుంబ సభ్యులు వారి నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. మండలంలోని నడిమిదొడ్డి గ్రామానికి చెందిన తప్పెట ఓబులేసు శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. దీంతో ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులను అంగీకరించి నేత్ర దానం చేశారు. అదేవిధంగా నార్పల ఉయ్యాలకుంట కాలనీకి చెందిన పుల్లయ్య మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులు కూడా నేత్రాలను దానం చేశారు. వారి నేత్రాలను అనంతపురంలోని రెడ్‌క్రాస్ సొసైటీ వారికి అందజేశారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విశేష సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, ఫాదర్ ఫెర్రర్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 50ఏళ్లుగా ఆర్డీటీ సంస్థ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్రం ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యూవల్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి, అన్ని మండలాల కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ఆర్డీటీకి మద్దతుగా ర్యాలీ

వేలాది గ్రామాల్లో లక్షలాదిమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)కి మద్దతుగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీటీకి విదేశీ నిధులను పునరుద్ధరించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు స్థానిక మాంఛూ ఫెర్రర్ విగ్రహం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఉద్యోగ సంఘం నాయకులు రాజగోపాల్, రాజన్న, సురేష్‌బాబు, నారాయణ, జగదీష్, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మధుమూర్తితో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి కుటుంబ సభ్యులు

'పల్లె' ఇంటికి ఉన్నత విద్యామండలి ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ మధుమూర్తి శనివారం అనంతపురంలోని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి నివాసానికి విచ్చేశారు. జెఎన్‌టియులో నిర్వహించిన స్నాతకోత్సవంలో పాల్గొన్న మధుమూర్తి నేరుగా పల్లె నివాసానికి వచ్చారు. దీంతో రఘునాథరెడ్డితోపాటు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పివికెకె ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ వెంకట కృష్ణ కిషోర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని మధుమూర్తి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ మాజీ డిజిపి శంకర్‌రెడ్డి, కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుబ్బారావు, రమేష్‌బాబు, మన్మథేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

తిరంగా యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

ఆపరేషన్ సిందూర్ దిగ్విజయంగా పూర్తి చేసిన త్రివిధ దళాల సైనికులకు మద్దతుగా అనంతపురంలో నిర్వహించిన తిరంగ ర్యాలీలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొని సంఘీభావం తెలిపారు. ర్యాలీలో జిల్లా అధికారులు, మాజీ సైనికులు, ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారు. ఈ ర్యాలీలో శింగనమల మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, చిదంబరి దొర, మాసూలు చంద్రమోహన్, చిదానందనాయుడు, పసుపుల శ్రీరామిరెడ్డి, గుర్రం లక్ష్మీనారాయణ, జీసీ బాబు, కొట్టాల సురేష్, చెన్నయ్య, బ్రహ్మయ్య, వలి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



తిరంగ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, మండల నాయకులు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుందాం

'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఎండలు తీవ్రమైన నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుందామని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి జెసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా తమ ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణకు వచ్చిన వారికి అందజేయాలన్నారు. ఇకపోతే వడదెబ్బకు గురి కాకుండా ఎక్కువ నీరు తీసుకోవాలన్నారు. అనంతరం మూగజీవాల కోసం నిర్మించనున్న పశువుల తొట్టెకు భూమిపూజ చేశారు. తర్వాత ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీటి ఇంకుడు గుంతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిపిఒ నాగరాజునాయుడు, ఎంపిడిఒ శకుంతలమ్మ, ఇఒఆర్‌డి సురేష్‌బాబు, ఎపిఒ గంగరాజు, పంచాయతీ సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



పెద్దపప్పూరులో మజ్జిగ పంపిణీ చేస్తున్న జెసి శివ్‌నారాయణ్‌శర్మ

అనంతపురం : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తెలుగు మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డిఎంహెచ్ఒ ఇబి దేవి స్వయానా పరక పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు యుగంధర్, వైద్యులు నారాయణస్వామి, అనుపమ జేమ్స్, సురేంద్ర, ఎఒ గిరిజ మనోహర్‌రావు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, పిఎంఒ నాగన్న పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని పలుగ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎండ తీవ్రత, వడగాల్పుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్, ఎపిఒలు ఎర్రమ్మ, తిప్పమ్మ, సర్పంచులు సుప్రియ, ఆలం శిరీషా, రమణకుమారి, కుళ్లాయిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, నారాయణమ్మ, స్వప్న, మల్లీశ్వరి, నాగలక్ష్మి, పెద్దన్న, లక్ష్మీదేవి, కుళ్లాయప్ప, నాగన్న, పరమేశ్వర్‌రెడ్డి, శివలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బొందలవాడ గ్రామంలోని ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ వద్ద ఉపసర్పంచు ఆలం వెంకట నరసానాయుడు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ వార్డు సభ్యులు, ఎంపిటిసి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాయదుర్గం : స్వర్ణాంధ్ర-స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో నిర్వహించిన 'బీట్ ద హీట్' ర్యాలీని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహులు, ప్రతాప్, మేనేజర్ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, మున్సిపల్ వార్డు సభ్యులు లావణ్య, పొరాళు గోవిందరాజులు, వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పొరాళు శివ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పామిడి : స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో 'బీట్ ద హీట్' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఒ తేజోష్ణ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంతోపాటు శ్రీధర్‌ఘట్ట, గోవిందవాడ గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, దాస్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని గౌరయ్య కొట్టాలలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరించారు. ముందుగా అమరవీరుడు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, ఎంపిడిఒ సొలమన్‌రాజ్, డిప్యూటీ ఎంపిడిఒ సదాశివమ్, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ లింగానాయక్, ఎపిఎం శ్రీనివాసులు, నాయకులు బుల్లే నారాయణస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి, పంచాయతీ రాజ్ ఇంజినీర్ నరేంద్ర, ఉపాధి ఇన్‌ఛార్జి ఎపిఒ సత్యమూర్తి, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో ఈనెల 19న కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి ఆర.కుళ్లాయప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఆ రోజు అంబేద్కర్ విగ్రహం నుంచి సిద్ధరాంపురం వరకూ రోడ్డు గుంతలు పూడ్చటంతోపాటు సిద్దరాంపురం దళితుల శ్మశానానికి వెళ్లే దారికి అడ్డంగా ఉన్న కంప చెట్లను తొలగించనున్నట్లు తెలిపారు. అలాగే మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సిపిఎం నాయకులు, సానుభూతిపరులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వాసుపత్రి ప్రహరీ పరిశీలన

యాడికి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూలిన ప్రహరీని ఎంపిడిఒ వీర్రాజు, ప్రభుత్వ వైద్యులు పరమేష్, టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు, తదితరులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు పరమేష్ ఆసుపత్రి ప్రహరీ కూలిపోవడంతో సమీప కాలనీవాసులు నిత్యం ఆసుపత్రి మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారన్నారు. దీనివల్ల రోగులకు ఇబ్బందికరంగా మారిందని ఎంపిడిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ త్వరలోనే నిధులు మంజూరు చేసి ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

యాడికి : మండలంలోని రైతుల సమస్యలు పరిష్కరించాలని టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ట్రాన్స్‌కో ఎఇ విజయ్‌ను శనివారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా రైతుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా రైతుల ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యను వివరించి త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహ చౌదరి, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం

యాడికి : మండల కేంద్రంలో వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ 26వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అయ్యప్ప స్వామికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. పూజల్లో సోమశేఖర్, పోకూరుప్రసాద్ చిట్టి స్వామి, ఆలయ పూజారి నాగరాజు శర్మ, వోడాఫోన్ నరేష్, జగదీష్, గంగవరం శ్రీధర్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటశివుడుయాదవ్‌కు అభినందనలు

శింగనమల : ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా ఎన్నికైన టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడుయాదవ్‌కు టిడిపి నాయకులు బండమీదపల్లి కాయల రమణయాదవ్ అభినందనలు తెలిపారు. ఈమేరకు శనివారం అనంతపురంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో వెంకటశివుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇందుకు వెంకట శివుడు ఉదాహరణ అన్నారు.



వెంకటశివుడు యాదవ్‌కు బొకే అందజేస్తున్న రమణయాదవ్

హెచ్‌ఐవిపై అవగాహన



హెచ్‌ఐవిపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

తాడిపత్రి : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తరిమెల రాజు కళా బృందం శనివారం స్థానిక చుక్కలూరు క్రాస్‌లో హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించింది. ఇందులో భాగంగా హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది.. ఎలా వ్యాపించదు.. రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమములో ఏరియా ఆసుపత్రి కౌన్సిలర్ ప్రతిభ, మాస్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ పియు.2 తాడిపత్రి ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథ్‌రెడ్డి, ఎఎన్ఎం విజయలక్ష్మి, ఓఆర్‌డబ్ల్యూ హామీదా, హాజరా, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని శ్రీధర్‌ఘట్ గ్రామంలో ఉన్న బస్సు సెంటర్ శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ ఎండలను దృష్టిలో ఉంచుకుని ఇటు బస్సు ప్రయాణికులు, అటు సచివాలయం వచ్చే ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తిప్పేస్వామి, గ్రామస్తులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



చచలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నేడు అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే

అనంతపురం : అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ అనుపమ జేమ్స్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి ప్రారంభమై తెలుగు తల్లి విగ్రహం మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకూ వెళ్లి తిరిగి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకుతుందన్నారు.



మేఘావృతమైన ఆకాశం

యల్లనూరులో వర్షం

యల్లనూరు : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ముఖ్యంగా యల్లనూరులో భారీ వర్షం కురిసింది. వర్షం రాకతో ఎండ వేడిమి నుంచి ప్రజలకు ఉపశమనం కలిగినట్లయింది.

గ్యాస్ ఏజెన్సీని దౌర్జన్యంగా లాక్కున్నారు..

జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులోని ఇండెన్ గ్యాస్ ఏజెన్సీని వైసిపి సానుభూతిపరుడు, బినామీ ఎద్దులు సూర్యప్రభాకరరెడ్డి దౌర్జన్యంగా లాక్కుని.. అసలైన నిర్వహకులకు తీరని అన్యాయం చేశాడని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని టిడిపి నాయకులు హరినాథరెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీ అసలైన నిర్వాహకురాలు ఎద్దుల సరస్వతి అయితే సూర్యప్రభాకరరెడ్డి బినామీగా వ్యవహరించి నడిపించాడన్నారు. అయితే వీరిద్దరి మధ్య తేడాలు రావడంతో తన ఏజెన్సీ తనకే కావాలని సరస్వతి కోరుకోవడంలో తప్పేమీలేదన్నారు. ఆమెకు ఏజెన్సీ దక్కకుండా చేసేందుకు సూర్యప్రభాకరరెడ్డి ఎన్నో కుట్రలు చేశాడని, అవన్నీ ఆమె గమనించి తనకు న్యాయం కావాలని కోరుకుందన్నారు. ఈనేపథ్యంలో నాలుగు మాసాలుగా గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఇవ్వాల్సిన సిలిండర్లను సరఫరా చేయకుండా నిలిపివేసి వినియోగదారులను అవస్థలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికారులు చొరవ తీసుకుని వచ్చే బుధవారంలోపు ఆమెకు గ్యాస్ ఏజెన్సీ ఇవ్వాలని, అలా జరగకపోతే గురువారం పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట ఇండెన్ గ్యాస్ నిర్వాహకురాలు సరస్వతి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.




మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

దుర్మార్గంగా వ్యవహరిస్తున్న జెసి వర్గీయులు

ఎద్దుల సూర్యప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరులో ఇండెన్ గ్యాస్ ఏజెన్సీని ఎంతో భద్రతతో కాపాడుకుంటూ వస్తున్న తనను భయపెట్టడానికి దాడి చేయడం దుర్మార్గమని ఎద్దుల సూర్యప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీ విషయంలో తాను ఏ తప్పిదం చేయలేదన్నారు. అన్ని హక్కులు తనవైపే ఉన్నాయన్నారు. తన వదిన సరస్వతి మాటలు విని జెసి ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో గ్యాస్ గోదాం వద్ద ఉన్న తలుపులను పగుగొట్టడమే కాకుండా కారు అద్దాలను ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి నేను ఎలాంటి ద్రోహం చేయలేదన్నారు. బినామీలకు అప్పజెప్పకుండా ఉండేలా ప్రధాన కార్యాలయ నిర్వాహకులకు ఖాతాలు, రికార్డులతో సహా అప్పజెప్పుతానని ఎన్నిమార్లు తెలియజేసినా వారు చేసిన నిర్లక్ష్యం చేయడంతో తనపై జెసి అనుచరులు దాడి చేసేందుకు కుట్రపన్ని కారు అద్దాలను ధ్వంసం చేశారని వాపోయాడు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎద్దుల సూర్యప్రభాకర్‌రెడ్డి

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి



మృతిచెందిన శంకరరెడ్డి

పెద్దవడుగూరు : మండలంలోని రావులుడికిలో బసిరెడ్డి శంకరరెడ్డి (55) అనే వ్యక్తి శనివారం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు. రాత్రి ఓ మోస్తరు వర్షం కురవడంతో ఉదయం విద్యుత్ సరఫరా లేదని తెలుసుకుని అటుగా వెళ్తున్న ఇతను విద్యుత్ నియంత్రిక వద్ద ఫీజు వేసే ప్రయత్నం చేశాడు. దీంతో విద్యుత్ సరఫరా అయి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై విద్యుత్తు ఎఇ షఫీవుద్దీన్ విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు చెప్పారు.

కాపరు వైరు చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన గాలిమరల వద్ద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కాపరు వైరును ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకుడు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్ నరసింహ తెలిపారు.